# ఇన్లాండ్ లెటర్ కథలు

## సందేశం?



ఆ వాడలో వున్న బోర్డన్ని గుడిసెల్లో ఆదో గుడిసె. ఆ గుడిసె చూట్టూ ఆ వాడలోని జనం కొంతమంది చేరారు.

కారణం ఆ గుడిసెలో వుండే రంగడి పెళ్లాం మంగ వురిటినెప్పులు పడుతోంది.

గుడిసెలోంచి బాధతో మంగ పెడుతోన్న కేకలు వినిపిస్తున్నాయి.

అది విని గుడ్లనీరు కక్కుకుంటున్న రంగడ్ని చూసి మందలింపుగా అంది వొకామె. "ఏంట్రా రంగా! నువ్వు కూడా ఇలా డీలా పడిపోతే ఎలా చెప్పు? దానికి ఇదేమన్నా మొదటి కానుపా? ఇప్పటికి ముగ్గురు మగపిల్లల్ని కంది. నువ్వేమీ కంగారుపడకు. ఊరుకో. చూస్తూండు. ఇంకో గంటలో ఆడపిల్లని ఎత్తుకుని నవ్వుతూ వస్తావ్. ఏడవకు లే".

ఆమె మాట నిజం కాలేదు. రంగడికి మళ్ళీ మగపిల్లాడే వుట్టాడు.

ఆ పిల్లాడ్ని చూసుకుని "దేవుడా! నా మొర వినలేదా? మళ్ళీ మగపిల్లాడ్నే ఇచ్చావేంటి స్వామీ! మళ్ళీసారైనా నా కడుపున ఆడపిల్ల వుట్టేలా చెయ్యి దేవుడా!" అని ప్రార్థించింది మంగ. సరిగ్గా అదే సమయంలో అక్కడికి దాదాపు రెండుకిలోమీటర్ల దూరంలో వున్న ఓ మధ్యతరగతి ఇంట్లో కుటుంబ నియంత్రణ గురించి ప్రభుత్వం ప్రసారం చేస్తోన్న లఘుచిత్రం దూరదర్శన్‌లో వస్తోంది. తన పరిస్థితి ఏమిటో బాగా తెలిసిన ఆ ఇంటి యజమాని ఒక్కబిడ్డ వుట్టగానే ఆపరేషన్ చేయించేసుకున్నాడు. అతనికా లఘుచిత్రంలోని సందేశం అవసరం ఏమాత్రంలేదు.

నిజంగా అది అవసరమైంది రంగడికే మరి. ఆ రెండు కిలోమీటర్లు దాటించి ఆ సందేశాన్ని రంగడికి ఎవరు అందిస్తారు?

—పైడికొండల వెంకటేశ్వరరావు.

---

## టైం

అనంతానికి కోపం వచ్చినా సంతోషం వచ్చినా ఒళ్లు తెలియదు. అవుడు అతను ఎలా ప్రవర్తిస్తాడో ఎదుటివాడికే తెలియాలి. అతను మద్రాస్ వెళ్లడానికి నెల్లూరు స్టేషన్‌లో సరిగా ఉదయం పది గంటలకు అడుగుపెట్టాడు. అప్పటికే మద్రాస్ వెళ్లే ఓ ఎక్స్‌ప్రెస్ ప్లాట్‌ఫాం మీద కదలాడినికి సిద్ధంగా ఉంది. దాన్ని చూడగానే అనంతానికి అవధులు దాటాయి. దీనికి కారణం లేకపోలేదు. ఎప్పుడూ



మద్రాస్ వెళ్లే రైలు గంటల తరబడి లేటురావడమే తప్ప ఒక్కసారి కూడా సరైన టైముకి వచ్చిన పాపానపోలేదు. అలాంటిది ఇవ్వాళ ఆ బండి సరైన టైంలో రావడమే! ఎందుకో అతనికి రైలు డ్రైవర్‌ను అభినందించాలనే కోరిక వుట్టింది. అంతే అతను గబగబా రైలు డ్రైవర్ దగ్గరకెళ్లి 'గుడ్ మార్నింగ్ డ్రైవర్ సాబ్' అని అతనిని విష్‌చేసి తనను అతనికి పరిచయం చేసుకున్నాడు. బండి కదలికతో గార్డు పర్మిషన్ కోసం ఎదురుచూస్తున్న డ్రైవర్ మందహాసంతో తిరిగి అతనికి విష్ చేశాడు.

"చూడండి డ్రైవర్‌సాబ్ మీబోటివాళ్లు ఈ రైల్వే శాఖలో ఉంటే మా బుర్రలో 'లేటు' అనేపదం చొరబడదు సరికదా మా యిక్కట్లు తప్పడమే కాకుండా రైల్వేశాఖకు మంచి క్రెడిట్ దక్కుతుంది గదా అన్నాడు తన సంతోషాన్ని వ్యక్తం చేస్తూ.

"దానికేముందిలెండి నా ధర్మాన్ని నేను నిర్వర్తించాను. అన్నాడు డ్రైవర్ యథాలాపంగా.

మీ డ్యూటీపై వున్న విశ్వాసంతో నేనొక చిరు కానుకను ఇవ్వాలనుకుంటున్నాని జేబులో వున్న పార్కర్ పెన్ తీసి డ్రైవర్‌కిచ్చాడు. అతడు చాలా సంతోషంతో థాంక్యూ అంటూ పెన్ తీసుకుని జేబులో పెట్టుకున్నాడు. ఇంతలో గార్డ్ విజిల్ వేసి పచ్చజెండా చూపడంతో అనంతం గబగబా వెళ్ళి తనకందిన పెట్టెలో జారబడి ఖాళీగానున్న సీటులో చతికిలబడ్డాడు. రైలు ప్లాట్‌ఫాం దాటి మద్రాస్‌వైపు కదిలిపోయింది.

ట్రైన్‌లో తన తోటిప్రయాణీకులతో మాటలు కలిపి 'ఇవాళ బండి సరైన టైంకు వచ్చినందుకు నాకెంతో సంతోషంగా ఉంది' అన్నాడు. డ్రయివర్ విషయంలో తను చేసిన గొప్పతనాన్ని చాటుకున్నాడు. ప్రక్కనున్న ప్రయాణీకులు అనంతం మాటలకు నవ్వుకుంటున్నారు. ఎందుకు నవ్వుతున్నారని అడుగగ, అందుకో ప్రయాణీకుడు "వాబొంద. నిన్న ఈ టైంకి రావలసిన బండి నేడు ఈ టైంకి మనకు దర్శనమిచ్చింది. మరి ఈ వేళ రావలసిన బండికి మోక్షమెవుడో? అని అనేసరికి అందరూ గొల్లుమన్నారు. ఇది నిజమేనా అన్నట్టు జరిగిన మోసానికి అనంతం స్పృహతప్పిపడిపోయినట్లు షాక్ తిన్నాడు.

—ఎస్. పేర్రాజు